క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న 108 సిబ్బంది

సరుబుజ్జిలి: అపరిష్కృతంగా ఉన్న 108 ఉద్యోగుల సమస్యలను కూటమి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని 108 సర్వీస్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు టి.విజయ్ మోహన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో 108 సిబ్బంది నిరసన తెలియజేశారు. అనంతరం ఎంపీడీఓ, తహసీల్దార్, వైద్యాధికారులకు వినతిపత్రాలు అందించారు. ఈ నిరసనలో 108 సిబ్బంది మురళి, వెంకటేష్, అమ్మినాయుడు, శ్రీనివాస్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న సివిల్ జడ్జి హరిప్రియ

నరసన్నపేట: కేసులు పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ సరైన వేదికని నరసన్నపేట సివిల్ జడ్జి సి.హెచ్.హరిప్రియ అన్నారు. డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు, ఎక్సైజ్ సీఐ రమణమూర్తి, న్యాయవాదులు, ఎస్‌ఐలతో సమీక్ష నిర్వహించారు. కేసుల పరిష్కారంలో న్యాయవాదులు, పోలీసులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. క్రిమినల్ కేసులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కోర్టు సమయం ఎంతో ఆదా అవుతుందని, కక్షిదారులకు సమయం కలిసి వస్తుందన్నారు. న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ గోపీబాల

సారవకోట: ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శులకు డీఎల్‌పీఓ గోపీబాల ఆదేశించారు. శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. స్వర్ణాంధ్ర యాప్‌లో నమోదు చేయాల్సిన వివరాలు త్వరగా అప్‌లోడ్ చేయాలన్నారు. సారవకోట గ్రామంలో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈఓపీఆర్డీ ప్రభాకరరావు ఉన్నారు.

బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి



సింహాచలం

హిరమండలం: రబీ పంటల బీమా ప్రీమియాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సింహాచలం శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీమా ప్రీమియం పేరుతో రైతులపై భారం వేయడం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు. గత ప్రభుత్వం ఉచిత పంటల బీమా అమలు చేసిందన్నారు. అదే తరహాలో ఈ రబీ సీజన్‌లోనూ బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. ఇప్పటికే కనీస ధరలు రాక రైతులు నష్టపోతున్న తరుణంలో బీమా ప్రీమియం అదనపు భారంగా మారిందన్నారు. సమగ్ర పంటల బీమా పథకాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు.

రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ భగవాన్‌నాయుడు

కొత్తూరు: మండలంలోని ఎన్ఎన్ కాలనీలో గల నాలుగో వార్డులో రూ.3.50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్‌నాయుడు శనివారం ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. పంచాయతీలో దశల వారీగా సీసీ రోడ్లు, కాలువలు నిర్మించడం జరుగుతుందన్నారు. మాజీ సర్పంచ్ పడాల వెంకటకృష్ణ, ఎద్దు దాసునాయుడు, శ్రీనివాసరావు, మడపాన రాజారావు, వార్డు మెంబర్లు మునకాల సంతోష్, కాదూరు వాసు, రామకృష్ణ, హేమగిరి పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఎల్.ఎన్.పేట: తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ పైడి లతశ్రీ శనివారం ఒక ప్రకటనలో అన్నారు. గత కొన్ని రోజులుగా ఖరీఫ్ వరిచేను కోతలు కోస్తున్నందున పొలాల్లో ఉన్న పంటను కాపాడుకోవాలన్నారు. అపరాలు, మొక్కజొన్న వంటి వాణిజ్య పంటలు వేసుకున్న రైతులు తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిస్తే పొలాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వరి కుప్పలపై టార్పలిన్లు వేసి కాపాడుకోవాలన్నారు.

పొలం పనుల్లో.. బిజీ.. బిజీ..

- ఒకవైపు ఖరీఫ్ వరిచేను కోతలు
- మరోవైపు రబీ వాణిజ్య పంటల సాగు
- వ్యవసాయ కూలీలకు చేతినిండా పని
- నియోజకవర్గంలో 78 వేల ఎకరాల్లో రబీ సాగు
- అధిక విస్తీర్ణంలో అపరాలు, మొక్కజొన్న



తురకపేట వద్ద రబీ వరి సాగుకు పొలాన్ని ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు

రబీ సాగు వివరాలు ఇలా..	
నియోజకవర్గంలో రెవెన్యూ గ్రామాలు	233
మొత్తం రైతులు	52,076 మంది
మొత్తం సాగు విస్తీర్ణం	78,160 ఎకరాలు
పెసర, మినుము పంటల సాగు	33,500 ఎకరాలు
మొక్కజొన్న సాగు	21,400 ఎకరాలు
రబీ వరి సాగు	12,150 ఎకరాలు
ఇతర పంటల సాగు	3,100 ఎకరాలు



ఖరీఫ్ వరిచేను కోస్తున్న యంత్రం

ఎల్.ఎన్.పేట: ఈ ఏడాది రబీ పంటల సాగుకు వాతావరణ పరిస్థితులు అనుకూలించాయి. పాతపట్నం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ ఒక వైపు ఖరీఫ్ వరిచేను కోతలు, మరోవైపు రబీలో పలు రకాల పంటల సాగు పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. ఖరీఫ్ వరిచేను కోతలు యంత్రాలు, కూలీలతో ముమ్మరంగా జరుగుతున్నాయి. రబీలో పప్పు జాతికి చెందిన అపరాల పంటలైన పెసర, మినుముతోపాటు వాణిజ్య పంటల్లో ప్రధానంగా చెప్పుకునే మొక్కజొన్న అధిక విస్తీర్ణంలో సాగుచేస్తున్నారు. వీటితోపాటు వంశధార కుడి, ఎడమ కాలువల దిగువన, సాగునీటి చెరువులు కింద రబీ వరి పంట వేస్తున్నారు. పదిరోజులకు పైగా రైతులు పొలం పనుల్లోనే ఉన్నారు. ఖరీఫ్ వరి చేను కోతలు, మొతలు, కుప్పలు పెట్టే పనులు, రబీలో రకరకాల పంటల సాగు పనుల్లో వ్యవసాయ కూలీలు బిజీగా ఉన్నారు. చేతినిండా పని లభిస్తోందని కూలీలు చెబుతున్నారు.

నియోజకవర్గంలో..

పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో మహేంద్రతనయ, వంశధార నదులున్నాయి. వంశధార నది నుంచి కుడి, ఎడమ ప్రధాన కాలువలున్నాయి. సాగునీటికి ఇబ్బంది లేదు. నదీ తీర ప్రాంతాలతోపాటు సాగునీటి చెరువుల దిగువన అధిక విస్తీర్ణంలో మొక్కజొన్నతోపాటు వరి సాగు చేస్తున్నారు.

ముమ్మరంగా రబీ పనులు



ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించటంతో రబీ సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వంశధార నదీతీరంలో మొక్కజొన్న పంటను వేసుకోవటం జరిగింది. ప్రతీ ఏడాది అధిక విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేస్తుంటాం. ఈ ఏడాది కూడా గతం కంటే ఎక్కువ విస్తీర్ణంలో మొక్కజొన్న వేశాం. చెరువుల దిగువన రబీ వరిసాగు చేస్తున్నాం.

– పల్లి అప్పలనాయుడు, రైతు, దబ్బపాడు, ఎల్.ఎన్.పేట

ఎరువులు సిద్ధంగా ఉంచాం



గతం కంటే ఈ ఏడాది రబీలో వాణిజ్య పంటలైన మొక్కజొన్నతోపాటు వరి సాగు విస్తీర్ణం పెరిగింది. రైతులకు ఇబ్బంది లేకుండా రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు సిద్ధం చేశాం. పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా అపరాల పంటలతోపాటు రబీలో వరి, మొక్కజొన్న సాగులో అధిక దిగుబడులు సాధించేందు అవగాహన కల్పించాం.

– పైడి లతశ్రీ, ఏఓ, ఎల్.ఎన్.పేట

జీతాలు సక్రమంగా చెల్లించాలి



జెడ్పీటీసీ సభ్యుడు గోవిందరావుకు వినతిపత్రం అందజేస్తున్న 104 యూనియన్ నాయకులు

ఆమదాలవలస: జీతాలు సక్రమంగా చెల్లించాలని శ్రీకాకుళం జిల్లా 104 యూనియన్ నాయకులు బెండి సతీష్, బి.బాలకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆమదాలవలస మండలం దూసి పీహెచ్‌సీ 104 సిబ్బందితో కలిసి ఆమదాలవలస జెడ్పీటీసీ సభ్యుడు బెండి గోవిందరావుకు వంజంగి గ్రామంలో శనివారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా 104 సిబ్బంది మాట్లాడుతూ తమకు నెల, నెలా సక్రమంగా జీతాలు చెల్లించకపోవటంతో కుటుంబ పోషణకష్టంగా మారుతుందన్నారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా కేవలం నెలకు రూ.50 వేల ఖర్చుతో నిర్వహించి ప్రజాధనం వృథా కాకుండా చూడాలని కోరారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్లు, డీఈఓలకు జీఓ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలన్నారు. అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ తిరిగి చెల్లించాలన్నారు. 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చేయాలని, సీనియర్ డ్రైవర్లను కాంట్రాక్టులో పెట్టాలన్నారు. వీటితోపాటు పలు సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా 104 యూనియన్ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

రేకుల షెడ్ తొలగింపు



ప్రభుత్వ స్థలంలో వేసిన రేకుల షెడ్



పూర్తిగా తొలగించిన అనంతరం ఇలా..

నరసన్నపేట: స్థానిక లక్ష్మీ టాకీస్ వద్ద గల ఆర్అండ్‌బీ స్థలంలో వేసిన రేకుల షెడ్‌ను అధికారులు శనివారం పూర్తిగా తొలగించారు. గడిచిన వారం రోజుల నుంచి ఈ వ్యవహారం రెవెన్యూ, పంచాయతీ అధికారులకు తలనొప్పిగా మారింది. అధికార పార్టీ నాయకుల నుంచి తీవ్ర ఒత్తిడి వచ్చినా రెవెన్యూ, పంచాయతీ అధికారులు సమన్వయంతో వ్యవహరించి ప్రభుత్వ ఆస్తిని కాపాడారు. రెండేళ్ల క్రితం గొట్టిపల్లి రెవెన్యూ పరిధిలో ని సర్వే నంబర్ 195/1లో ఉన్న ఈ స్థలంలో ఆర్అండ్‌బీకి చెందిన రోడ్డు పోరంబోకుగా భావించి భవనాలు తొలగించారు. అప్పటినుంచి ఖాళీగా ఉండటంతో ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకొని రేకుల షెడ్లు వేసేందుకు కొంతమంది స్థానికులు ప్రయత్నించగా.. అధికార యంత్రాంగం అడ్డుకుంది. తహసీల్దార్ సత్యానారాయణ, పంచాయతీ ఈఓ ద్రాక్షాయిని సమన్వయంతో వ్యవహరించి విలువైన ఈ స్థలం అన్యాక్రాంతం కాకుండా అడ్డుకున్నారు. గురువారం రేకుల షెడ్‌ను పూర్తిచేసేందుకు ప్రయత్నించగా కొంత భాగాన్ని తొలగించిన విషయం విదితమే. మిగిలిన రేక్‌లు, ఐరెన్ రాడ్లను పూర్తిగా తొలగించారు.

లక్ష్యానికి దూరంగా..!



సరుబుజ్జిలి మండలంలోని యరగాం గ్రామంలో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వినియోగానికి దూరంగా ఉంది. ఈ కేంద్రంలో సేంద్రియ ఎరువుల తయారీ, తడి, పొడి చెత్త వేరు చేసే విధానం సక్రమంగా చేపట్టడం లేదు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన కేంద్రం లక్ష్యానికి దూరంగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. - సరుబుజ్జిలి

దుప్పట్ల పంపిణీ



పాతపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న సత్యసాయి బాబా మందిరం వద్ద బాబా జన్మదిన వేడులు శనివారం నిర్వహించారు. 110 మంది పేద వృద్ధులకు దుప్పట్లను బాబా కమిటీ సభ్యులు కె.వి.రమణమూర్తి, ఎన్.శ్రీనివాసరావు, వెంకటరమణ, ఎస్.కామేశ్వరావు, ఎస్.మధుబాబు పంపిణీ చేశారు. పాతపట్నం, రంకిణి, దాసుపురం, బురికిపేట, దశరథపురం, బగంతర, సూర్యానారాయణపురం గ్రామానికి చెందిన పేద వృద్ధులకు దుప్పట్లు అందజేశామన్నారు. - పాతపట్నం

కళ్లాల్లోనే ధాన్యం



ఈ చిత్రం హిరమండలం మండలం భగీరథిపురం సమీపంలోనిది. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి కోతలు దాదాపు పూర్తి కావస్తున్నాయి. పొలాలు, కళ్లాల్లోనే నూర్పిడి చేశారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఇప్పటికీ తెరవకపోవడంతో చాలామంది రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయిస్తున్నారు. మరికొంతమంది రైతులు కేంద్రాలు తెరిస్తే విక్రయించేందుకు సిద్ధం చేశారు. - హిరమండలం

ఆరుబయటే వంట



సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంట గది నిర్మించినా.. సాంకేతిక కారణాల వలన ప్రారంభించలేదు. వంట నిర్వాహకులు రేకుల షెడ్డులో వంట చేస్తున్నారు. వర్షా కాలంలో ఇబ్బంది పడుతున్నారు. వండిన పదార్థాలు కుక్కలు, క్రిమికీటకాలు వలన పాడయ్యే ప్రమాదముందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వంట గదిని వెంటనే ప్రారంభించాలని కోరుతున్నారు. - సరుబుజ్జిలి

48 గంటల్లో ధాన్యం డబ్బులు



ధాన్యం లారీని పరిశీలించి సిబ్బందికి సూచనలిస్తున్న అధికారులు

జలుమూరు: రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి 48 గంటల్లో డబ్బులు వారి బ్యాంక్ ఖాతాలకు జమ చేయడం జరుగుతుందని జిల్లా పౌరసరఫరాల డీఎం, డీఎస్‌ఓ శ్రీనివాసరావు, సూర్యప్రకాశ్ అన్నారు. శనివారం పాగోడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులు ధాన్యాన్ని వారికి నచ్చిన మిల్లుకు తరలించి విక్రయించుకోవచ్చన్నారు. తేమ శాతం, నాణ్యత సాంకేతిక సిబ్బంది పరిశీలించిన తరువాత కొనుగోలు ప్రక్రియ జరుగుతుందన్నారు. అనంతరం తిలారు జంక్షన్‌లో ఉన్న రైస్ మిల్లును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏడీ రవీంద్రభారతి, ఏఓ సురేష్ కుమార్, సీఎస్‌డీటీ షరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం..

ధాన్యం కొనుగోలుకు సంబంధించి స్థానిక సర్పంచ్‌కు కనీసం సమాచారం ఇవ్వకపోవడంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నామని దామ మన్మధరావు తెలిపారు. దీనికి సంబంధిత అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వంలో పంచాయతీరాజ్‌శాఖా మంత్రి పవన్ కల్యాణ్ సర్పంచ్‌లకు గౌరవం ఇస్తామని చెప్పడం అంటే ఇదేనా అని అన్నారు.

చలో శ్రీకాకుళం విజయవంతం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాల మాహానాడు సభ్యులు

పాతపట్నం: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్న చలో శ్రీకాకుళం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాలమహానాడు పాతపట్నం మండల అధ్యక్షుడు తొగిరి లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. శనివారం పాతపట్నం బస్టాండ్ వద్ద చలో శ్రీకాకుళం పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండలంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, విద్యార్థులు శ్రీకాకుళంలోని ఏడు రోడ్ల కూడలికి పది గంటలకు చేరుకుని ర్యాలీ, బహిరంగ సభల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. శిర్ల జోగారావు, శిర్ల ప్రభాకరరావు, యజ్జల భాస్కరరావు, నవగాన రత్నకుమార్ పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న డీసీ శ్రీకాంత్ రెడ్డి

పొందూరు: మద్యం అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీసీ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పొందూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను శనివారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. బెల్టు దుకాణాలు లేకుండా నిరంతరం పర్యవేక్షణ చేయాలని సీఐ రాజుకు ఆదేశించారు. ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి జయంతి వేడుకలు



జలుమూరు: దుప్పట్లు పంపిణీ చేస్తున్న భజన మండలి ప్రతినిధులు

జలుమూరు: భగవాన్ సత్యసాయి ప్రేమ స్వరూపుడని చల్లవానిపేట భజన మండలి ట్రస్ట్ చైర్మన్ పంచిరెడ్డి త్రినాథరావు అన్నారు. శనివారం సత్యసాయి జయంతి పురస్కరించుకొని చల్లవానిపేటలో వృద్ధులు, పేదలకు దాత పాగోటి నీలాంబరం అందించిన 160 దుప్పట్లు పంపిణీ చేశారు. భజన మండలి కన్వీనర్ ఆనేం యోగీశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

నరసన్నపేట: మండలంలో సత్యసాయి జయంతి వేడుకలు నిర్వహించారు. పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. సాయి వ్రతాలు నిర్వహించారు.

సారవకోట: మండలంలోని అక్కివలస గ్రామంలో గద్దిబోయిన కృష్ణ ఆధ్వర్యంలో అన్నసంతర్పణ చేపట్టారు. సారవకోటలో పలువురు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

ఎల్.ఎన్.పేట: శ్యామలాపురంలో ఆధ్యాత్మిక అంశాలపై విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సత్యసాయి భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

బూర్జ: మండలంలోని లక్కుపురంలో ఎంపీపీ కర్నేన దీప ఆధ్వర్యంలో, బూర్జతోపాటు పలు గ్రామాల్లో సాయిబాబా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

ఆమదాలవలస: సాయిబాబా జయంతి వేడుకలు వేణమ్మపేట – అక్కులపేట సమితిలో ఘనంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

హిరమండలం: మండల కేంద్రంలో సత్యసాయి బాబా జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. సాయి భక్తులు పాల్గొన్నారు.

పాతపట్నం: ఆల్ఆంధ్రా రోడ్డు సమీపంలో షిర్డీగిరిపై ఉన్న షిర్డీసాయిబాబా మందిరంలో 23వ శంకుస్థాపన వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆటో బోల్తాపడి ఇద్దరికి గాయాలు



గాయపడిన నీలకంఠం

జలుమూరు: మండలంలోని లింగాలవలస బంకు వద్ద శనివారం ఉదయం ఆటో బోల్తా పడిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చల్లవానిపేట నుంచి నరసన్నపేట వైపు ముగ్గురు ప్రయాణికులతో డ్రైవర్ నీలకంఠం ఆటోలో వెళ్తుండగా ఒక్కసారిగా అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లాడు. ఆటో బోల్తా పడటంతో నీలకంఠంకు తీవ్ర గాయాలయ్యాయి. సారవకోట మండలం అలుదు గ్రామానికి చెందిన నరసమ్మ సైతం గాయపడింది. బాధితులను నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడి నుంచి మెరుగైన చికిత్స శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు.

మాలమహానాడు మండల అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ



పాతపట్నం: మాలమహానాడు మండల అధ్యక్షుడిగా తొగిరి లక్ష్మీనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులుగా శిర్ల జోగారావు, యజ్జల భాస్కరరావు తెలిపారు. శనివారం మండల కార్యవర్గ సమావేశం నిర్వహించిన్న కార్యవర్గాన్ని ఎన్నికున్నట్లు చెప్పారు. గౌరవ అధ్యక్షుడిగా సల్ల పాపయ్య, గౌరవ సలహాదారుడిగా శిర్ల ప్రభాకరరావు, ఉపాధ్యక్షులుగా సీమ మాధవరావు, కొప్పల అప్పారావు, కుప్పిలి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా నవగాన రత్నకుమార్, కార్యదర్శులుగా దారగరికయ్య, అలికాన రమేష్, బసవల రవి, కోశాధికారిగా కరజాడ గోవిందరావు, కార్యవర్గ సభ్యులుగా కె.గురువులు, శిర్ల రవి, యజ్జల పురుషోత్తం, సీమల హరి, దొడ్ల నారాయణరాజు, ముంజేటి శాంతారావు ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం రెండేళ్లు కొనసాగుతుందని ఎన్నికల అధికారులు తెలిపారు.

పరామర్శ..



అమ్మాయమ్మ కుటుంబాన్ని పరామర్శిస్తున్న కృష్ణచైతన్య, నాయకులు

సారవకోట: మండలంలోని అలుదు గ్రామానికి చెందిన శిమ్మ అమ్మాయమ్మ ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని పోలాకి జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు ధర్మాన కృష్ణచైతన్య శనివారం పరామర్శించారు. చిన్నగుజ్జువాడ గ్రామానికి చెందిన కొండాల రాధమ్మ అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆమెను పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు వరుదు దేవీప్రసాద్, యాళ్ల శ్యామసుందరరావు, గొర్లె ఢిల్లీరావు, రావాడ శ్రీనివాసరావు, కల్యాణం శ్రీను తదితరులు ఉన్నారు.

వరి విత్తనాల ఉత్పత్తికి చర్యలు

- ఏపీ సీడ్స్ మేనేజర్ బాలకృష్ణ



వరి పంటను పరిశీలిస్తున్న ఏపీ సీడ్స్, వ్యవసాయశాఖ అధికారులు

నరసన్నపేట: జిల్లా వ్యాప్తంగా ఏటా 50 వేల క్వింటాళ్ల విత్తనాలు రైతులకు సరఫరా చేస్తున్నామని, ఈ మేరకు విత్తనాలు మన ప్రాంత రైతులే ఉత్పత్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీ సీడ్స్ మేనేజర్ పి.బాలకృష్ణ తెలిపారు. మండలంలోని సత్యవరంలో ఖరీఫ్‌లో 27 ఎకరాల్లో రైతులు విత్తనోత్పత్తి పథకంలో భాగంగా వరిని పండించారు. రైతులతో ఏపీ సీడ్స్, వ్యవసాయశాఖ అధికారులు శనివారం ముఖాముఖి నిర్వహించారు. డీఎం మాట్లాడుతూ ఈ సీజన్‌లో జిల్లాలో 648 ఎకరాల్లో విత్తనోత్పత్తి కింద వరిని సాగు చేయడం జరిగిందన్నారు. 12 వేల క్వింటాళ్ల విత్తనాలు దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. రానున్న ఖరీఫ్‌కు ఈ విస్తీర్ణం రెట్టింపు చేసి మనకు కావాల్సిన విత్తనాలు మన ప్రాంత రైతులే పండించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతుల వద్ద కేజీ రూ.28 లకు కొనుగోలు చేస్తున్నామని, రైతులు సహకరించాలన్నారు. ప్రస్తుతం మన జిల్లా రైతులకు అవసరమయ్యే విత్తనాలు ఇతర ప్రాంతాల నుంచి తీసుకువస్తున్నామని, వ్యయప్రయాసలకు గురవుతున్నామన్నారు. రైతుల అభిప్రాయాలు, వారి అనుభవాలు తెలుసుకున్నారు. రైతు ఆరంగి కోటేశ్వరరావు, తదితరులు మాట్లాడుతూ విత్తనోత్పత్తిలో వరి పండించే రైతులకు రాయితీలు ఇవ్వాలని, పండించిన ధాన్యానికి వెంటనే డబ్బులు వచ్చేలా చూడాలని కోరారు. పండిన ధాన్యం ఏపీ సీడ్స్‌కు రైతులే పంపిస్తున్నారని, దీంతో ట్రాన్స్‌పోర్టు ఖర్చులు అధికమవుతున్నాయని, ఈ ఖర్చులు ఏపీసీడ్స్‌వారే భరించాలని కోరారు. విత్తనోత్పత్తిలో భాగంగా వరి విత్తనాలు ధరలు కూడా అధికంగా ఉంటున్నాయని, ఈ మొత్తం అంతా రైతులే పెట్టుకుంటున్నారని, దీంట్లో రాయితీలు ఉంటే రైతులు మరింతగా ఆసక్తి చూపుతారన్నారు. ఏపీ సీడ్స్ రాష్ట్ర ప్రతినిధి జలంధ్రం, శివజ్యోతి, వ్యవసాయ శాఖ ఏడీ రవీంద్రభారతి, ఏఓ కె.సునీత తదితరులు పాల్గొన్నారు.

1,400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



సామగ్రిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

మెళియాపుట్టి: గిరిజన గ్రామాలలో నాటు సారా స్థావరాలపై దాడులు ముమ్మరం చేస్తున్నట్లు టెక్కలి ఎక్సైజ్ సీఐ షేక్ మీరా సాహెబ్ అన్నారు. శనివారం మండలంలోని నేలబొంతు గ్రామంలో టెక్కలి, నరసన్నపేట ఎక్సైజ్ సిబ్బంది సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1,400 లీటర్ల పులిసిన బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 60 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి వినియోగించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. టెక్కలి, నర్సన్నపేట ఎస్ఐలు సత్యనారాయణమూర్తి, గురుమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

15 మద్యం బాటిళ్ల స్వాధీనం

సారవకోట: మండలంలోని కేశవలస గ్రామానికి చెందిన పొట్నూరు వెంకటరమణ వద్ద 15 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఎస్ఐ అనీల్ కుమార్ శనివారం తెలిపారు. పాన్ షాపులో మద్యం అక్రమంగా విక్రయిస్తుండటంతో పట్టుకున్నట్లు చెప్పారు.